సాక్షి
అన్నమయ్య జిల్లా
గురువారం । 7 । మార్చి । 2024



8న వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణం

భవిష్యత్ కాలజ్ఞాన కర్త పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి, గోవింద మాంబల కల్యాణ వేడుకలకు బ్రహ్మంగారి మఠం సిద్ధమవుతోంది. ఈ నెల 8న కల్యాణం నిర్వహించనున్నారు. - 8లో



అంబులెన్స్, బైక్ ఢీ: ఒకరి మృతి

అంబులెన్స్, బైక్ ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందగా, మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన బుధవారం రాత్రి ఆరోగ్యవరం వద్ద జరిగింది. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.150	రూ.200
రెండోరకం	రూ.80	రూ.148

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 91 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా

– ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ కృష్ణారెడ్డి



కన్నెమడుగు సబ్‌స్టేషన్ పరిశీలిస్తున్న ఎస్ఈ కృష్ణారెడ్డి

తంబళ్లపల్లె : వ్యవసాయ, గృహ విద్యుత్ వినియోగదారులకు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయడమే లక్ష్యంగా ముందస్తు చర్యలు చేపట్టినట్లు ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ కృష్ణారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన తంబళ్లపల్లె నియోజకవర్గంలో పర్యటించారు. పలు సబ్‌స్టేషన్లను తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. విద్యుత్ ఉద్యోగులకు పలు సూచనలు ఇచ్చారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంలో కంటే ప్రస్తుతం వ్యవసాయ కనెక్షన్లు వేలలో అధికమయ్యాయన్నారు. ఇటు వ్యవసాయం, అటు గృహ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం వ్యవసాయ కనెక్షన్లు, గృహ కనెక్షన్లు విభజించి సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రధానమంత్రి సూర్యఘర్‌మస్తు బిజిలి యోజన ద్వారా ప్రతి ఇంటికీ సోలార్ ప్యానల్స్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టామన్నారు. ఆయన వెంట ట్రాన్స్‌కో డీఈ యుగంధర్, ఏడీఈ రుక్మాంగద బాబు, విద్యుత్ సిబ్బంది ఉన్నారు.

ఎంఈఓ పద్మజ సస్పెన్షన్

ఓబులవారిపల్లె : మండల విద్యాశాఖాధికారి పద్మజను సస్పెండ్ చేస్తూ బుధవారం ఆర్‌జేడీ వై. రాఘవరెడ్డి ఉత్తర్వులు జారిచేశారు. పలు అవినీతి ఆరోపణలపై అప్పటి ఆర్‌జేడీ వెంకట కృష్ణారెడ్డి నోటీసులు జారీచేసి కమిటీని నియమించి విచారణ జరిపారు. ప్రస్తుత ఆర్‌జేడీ ఆమెను సస్పెండ్ చేశారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

- 17086 మందికి 16048 మంది విద్యార్థులు హాజరు
- డీఐఈఓ కృష్ణయ్య

రాయచోటి : అన్నమయ్య జిల్లాలో బుధవారం ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. బుధవారం జిల్లాలో 54 పరీక్షా కేంద్రాల్లో 17086 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉంది. వీరిలో 16048 మంది విద్యార్థులు హాజరు కాగా 1038 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి కృష్ణయ్య చెప్పారు. మొదటి సంవత్సరం జనరల్ పరీక్షలకు 15729 మంది విద్యార్థులకు గాను 14823 మంది పరీక్షలు రాశారు. 906 మంది హాజరుకాలేదు. ఒకేషనల్ పరీక్షకు 1357 మంది విద్యార్థులకు గాను 1225 మంది విద్యార్థులు హాజరు కాగా 132 మంది గైర్హాజరైనట్లు డీఐఈఓ తెలిపారు.

న్యాక్ పీర్ సభ్యుడిగా సుధాకర్‌రెడ్డి



వైవీయూ : నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్ (న్యాక్) పీర్ కమిటీ సభ్యుడుగా కడప ప్రభుత్వ పురుషుల కళాశాల భౌతికశాస్త్ర ఆచార్యులు డాక్టర్ బుసిరెడ్డి సుధాకర్‌రెడ్డి నియమితులయ్యారు. విశ్వవిద్యాలయాలు, డిగ్రీ, ఇంజినీరింగ్ తదితర విద్యాసంస్థలు ర్యాంకింగ్, గ్రేడింగ్ పొందడంలో కీలకంగా వ్యవహరించే న్యాక్ కమిటీలో కడప ఆచార్యుడికి చోటు దక్కడం విశేషం. దీనికి సంబంధించిన ఉత్తర్వులు న్యాక్ డైరెక్టర్ ఆచార్య కన్నబిరన్ గణేశన్ మెయిల్ ద్వారా పంపినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్ తెలిపారు. డా. సుధాకర్‌రెడ్డికి ఉన్న బోధన, పరిశోధన అనుభవం, పరిశోధన పత్రాలు, పరిశోధక ప్రాజెక్టులు, పరిశోధక విద్యార్థుల పర్యవేక్షణ తదితర కారణాలతో న్యాక్ పీర్ టీం మెంబర్‌గా ఎంపికచేశారు.

శైవ క్షేత్రాలకు 250 బస్సులు



కడప కోటిరెడ్డిసర్కిల్ : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లాలోని వివిధ శైవ క్షేత్రాలకు 250 ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి గోపాల్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ జిల్లాలోని పొలతలకు 120, నిత్యపూజకోన 35, లంకమల 34, అల్లాడుపల్లె దేవలాలు 9, కన్యతీర్థం 7, బి.మఠం 17, జ్యోతి 9, భానుకోట 3, మల్లెంకొండ 4, ఎస్ఎస్‌మఠం 3, ఎ.కోన 5, సంగమేశ్వరానికి 4 బస్సులు నడుస్తాయన్నారు. కడప ఆర్టీసీ బస్టాండులో బస్సుల వివరాలు, ప్రయాణీకుల సమాచారాన్ని తెలియజేసేందుకు ప్రత్యేకంగా సిబ్బందిని సైతం ఏర్పాటు చేశామని ఆయన వివరించారు.

ఆడపడుచులకు చేయూత

- ప్రతిసారి క్రమం తప్పకుండా అనుకున్న సమయంలోనే అందజేత
- గత రెండు మూడు విడతల కంటే నాల్గవ విడతలో పెరిగిన లబ్ధిదారులు
- జిల్లాలో వైఎస్సార్ చేయూత పథకం ద్వారా 80,931 మందికి ప్రయోజనం
- అక్కాచెల్లెమ్మల ఖాతాలకు జమకానున్న రూ. 151.75 కోట్ల సొమ్ము
- నేడు అనకాపల్లిలో బటన్ నొక్కి ఆర్థిక లబ్ధి చేకూర్చనున్న సీఎం వైఎస్ జగన్
- అన్నమయ్య జిల్లా కలెక్టరేట్‌లో మెగా చెక్కు అందించనున్న కలెక్టర్, ప్రజాప్రతినిధులు

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. వైఎస్సార్ చేయూత పథకం ద్వారా ఏటా మహిళల ఖాతాలకు నిధులు జమ చేస్తున్న ప్రభుత్వం తాజాగా నాలుగో విడత నిధుల విడుదలకు సిద్ధమైంది. మహిళలను ఆర్థికంగా పరిపుష్టం చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చేపడుతున్న కార్యక్రమాలు ఎంతో సత్ఫలితాలిస్తున్నాయి. మహిళల సంక్షేమం.. అభివృద్ధి కోసం నిత్యం ఆలోచిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం మేలు మరువలేమని మహిళలంటున్నారు.



సాక్షి,రాయచోటి : ఆడపడుచులకు ఆర్థిక భరోసా లభించనుంది. ప్రజా సంకల్ప పాదయాత్ర సాక్షిగా ఇచ్చిన మాటకు కట్టుబడిన ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు అనుకున్న మేర...ప్రతి ఏడాది క్రమం తప్పకుండా సొమ్ములు అందిస్తున్నారు. ప్రభుత్వం అందించే సొమ్ములతో మహిళలు ఆర్థికంగా రాణించాలన్న సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాలకు చెందిన 45-60 ఏళ్ల మధ్య వయస్సుగల అర్హులైన మహిళలందరికీ రూ. 18,750 చొప్పున అందిస్తోంది. ప్రత్యేకంగా అక్కాచెల్లెమ్మలకు సంబంధించి స్వయం సహాయక బృందాలకు ఆసరా ద్వారా రుణాలు మాఫీ చేస్తున్న ప్రభుత్వం వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం ద్వారా ఆ సొమ్ములు కూడా అందించింది. ఇలా మహిళల ఆర్థిక ఎదుగుదలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటూ వస్తోంది. ఇప్పటికే మూడు విడతల్లో చేయూతనందించిన వైఎస్ జగన్ సర్కార్ తాజాగా నాల్గవ విడతలో భారీ ఎత్తున జిల్లాలో లబ్ధిదారులకు సొమ్ములు అందించనుంది. నాల్గవ విడత సంబంధించి అనకాపల్లి బహిరంగ సభ ద్వారా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళల ఖాతాలకు చేయూత సొమ్ములను విడుదల చేయనున్నారు. దీంతో మహిళల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

భారీగా పెరిగిన లబ్ధిదారులు

అన్నమయ్య జిల్లాలోని ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాలకు చెందిన మహిళలకు ఇప్పటికే రెండు విడతల ద్వారా ప్రభుత్వం చేయూత సొమ్ములు అందించింది. ఒక్కొక్కరికి రూ. 18,750 చొప్పున మొదటి విడతలో 65,277 మందికి రూ. 122.39 కోట్లు అందించారు. రెండవ విడతలో 70,409 మందికి రూ. 132.01 కోట్లు, మూడ విడతలో 79157 మందికి రూ. 148.42 సొమ్ములు జమ చేశారు. నాల్గవ విడతకు వచ్చేసరికి అర్హులైన వారందరినీ పథకంలో చేర్చడంతో లబ్ధిదారుల సంఖ్య భారీగా పెరిగింది. నాల్గవ విడతలో 80931 మంది లబ్ధిదారులకు రూ.151.75 కోట్ల సొమ్మును అందించనున్నారు. ఈ నాల్గవ విడత అందజేతతో పేదరికంలో మగ్గుతున్న పేద మహిళలకు ఒక్కొక్కరికి రూ. 75 వేలు చొప్పున జగన్ సర్కార్ జమ చేసింది. ఈ సొమ్ములతో వారు ఆర్థికంగా పండ్లు, కూరగాయలు, వస్త్రాలు, జీవాల పెంపకం, పాడి పరిశ్రమ, ఇతర చిన్న చిన్న వ్యాపారాలు నిర్వహించుకునేందుకు వైఎస్సార్ చేయూత ఆర్థికంగా భరోసానిచ్చింది. ముఖ్యమంత్రి చేసిన మేలు ఎప్పటికీ మరువలేమని మహిళలంటున్నారు.

నేడు కలెక్టరేట్‌లో లబ్ధిదారులకు మెగా చెక్కు అందజేత

అన్నమయ్య జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో గురువారం జిల్లాలోని ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాలకు చెందిన అర్హులైన వారికి నాల్గవ విడతకు సంబంధించి సుమారు రూ. 151.75 కోట్ల మెగా చెక్కును అందించనున్నారు. సీఎం సభలో బటన్ నొక్కి నిధులు విడుదల చేయగానే అన్నమయ్య కలెక్టరేట్‌లో మహిళలకు జిల్లా కలెక్టర్ అభిషేక్ కిశోర్‌తోపాటు ఇతర ప్రజాప్రతినిధులు మెగా చెక్కును అందించనున్నారు.

అన్నమయ్య జిల్లాలో వైఎస్సార్ చేయూత పథకానికి సంబంధించిన వివరాలు

సంవత్సరం	లబ్ధిదారులు	మొత్తం (రూ. కోట్లలో)
2020	66277	122,39
2021	70409	132.02
2022	79157	148.42
2023-24	80931	151.75

నియోజకవర్గాల వారీగా నాల్గవ విడత వైఎస్సార్ చేయూత సొమ్ము వివరాలు

రైల్వేకోడూరు	10,515	19.72
మదనపల్లె	16,281	30.53
పీలేరు	15,764	29.56
రాజంపేట	9477	17.77
రాయచోటి	14927	27.99
తంబళ్లపల్లె	13967	26.19
మొత్తం	80,931	151.75

జీవన ప్రమాణాలు మెరుగు పరుచుకోవాలి



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి ఏడాది క్రమం తప్పకుండా కచ్చితమైన సమయంలో వైఎస్సార్ చేయూత సొమ్ములు అందిస్తున్నారు. ఎన్ని అవాంతరాలు ఎదురైనా మహిళలకు సరైన సమయంలో ఆర్థిక భరోసా కల్పిస్తూ వారి జీవన ప్రమాణాల మెరుగుకు ప్రత్యేక కృషి చేస్తున్నారు. ప్రభుత్వం అందించే చేయూత సొమ్మును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని ఆయా మహిళలు ఎంచుకున్న రంగాల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలి. ప్రతి రూపాయి వనరులు పెంపొందించుకునేందుకు ఉపయోగించి ఆర్థికంగా బలోపేతం కావాలి. జిల్లాలోని నాల్గవ విడత 80,931 మందికి సుమారు రూ. 151.75 కోట్ల సొమ్మును అందజేస్తున్నాం. కలెక్టరేట్‌లో మహిళలకు చెక్కును అందించనున్నాం.

– ఎం.అభిషిక్త్ కిశోర్, కలెక్టర్, రాయచోటి, అన్నమయ్య జిల్లా

కమనీయం.. రాచరాయుడి కల్యాణం



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



స్వామివారికి పట్టువస్త్రాలు తెస్తున్న ఎమ్మెల్యే

రాయచోటిటౌన్ : రాయచోటిలోని వీరభద్ర స్వామి కల్యాణం అత్యంత కమనీయంగా కనుల పండువగా సాగింది. శ్రీ భద్రకాళీ సమేత వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి మొదలయ్యాయి. రెండవ రోజైన బుధవారం నిర్వహించిన స్వామి వారి కల్యాణం ప్రధాన ఘట్టంగా జరిగింది. ఈ కల్యాణ మహోత్సవం ఆలయ పాలక మండలి అధ్యక్షురాలు పోలంరెడ్డి విజయ, ఆలయ ఈఓ డీవీ రమణారెడ్డి, మున్సిపల్ చైర్మన్ పోలంరెడ్డి దశరథరామిరెడ్డిల ధ్వర్యంలో శ్రీ ప్రణవానందగిరి స్వామి (నర్రా వెంకట భాస్కర సిద్ధాంతి) ఆచార్యత్వంలో రుత్వికల వేద మంత్రోచ్చారణల మధ్య నేత్రపర్వంగా సాగింది.

స్వామి వారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పణ...

స్వామి వారి కల్యాణానికి అన్నమయ్య జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు.

భక్తులకు అన్నప్రసాదం..

స్వామివారి కల్యాణ మహోత్సవానికి స్థానిక భక్తులతో పాటు కన్నడ భక్తులు విశేషంగా తరలి వచ్చారు. వీరికి మన్నూరు రాజశేఖర్, ఆయన భార్య విజయ కుమారి, మన్నూరు హరిప్రసాద్, ఆయన భార్య వాణిల ఆధ్వర్యంలో అన్నదాన ప్రసాదాన్ని అందజేశారు. భక్తులందరికీ తీర్థప్రసాదాలతో పాటు ముత్యాల తలంబ్రాలు వేదపండితులు పంపిణీ చేశారు.

టెన్త్ పరీక్షలకు పటిష్ట భద్రత

- కాపీయింగ్ వీల్లేని రీతిలో అత్యాధునిక వ్యవస్థ
- పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేస్తున్న అధికారులు



స్టడీ అవర్‌లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులు

మదనపల్లె సిటీ : పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో తప్పిదాలకు ఆస్కారం లేని విధంగా ప్రభుత్వం పటిష్ట ఏర్పాట్లు చేస్తోంది. పాఠశాల విద్యార్థి జీవితంలో కీలకమైన పదో తరగతి అధిగమించేందుకు విద్యార్థులు పడుతున్న కష్టానికి ప్రతిఫలంగా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతూ, మరో వైపు పేపర్ లీకేజీ పేరుతో తప్పుడు ప్రచారాలను సమర్థవంతంగా తిప్పికొట్టేందుకు చర్యలు తీసుకుంటోంది. ఈనెల 18 నుంచి జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత పాఠశాలల నుంచి 25,522 మంది రెగ్యులర్ విద్యార్థులు హాజరు కానున్నారు. వీరి కోసం 129 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఏడు పేపర్ల విధానంలో పరీక్షలు జరగనున్నాయి. ఆయా రోజుల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకు పరీక్షలు జరగనున్నాయి.

లీకేజీ పుకార్లకు ఆస్కారం లేని విధంగా...

పరీక్షలు ప్రారంభమైన రోజు మొదలు విద్యార్థులతో వారి తల్లిదండ్రుల ముఖాల్లో ఆందోళన కనిపిస్తుంది. అత్యంత కీలకమైన పబ్లిక్ పరీక్షలు జరుగుతున్న రోజున పేపర్ లీకేజీ అని కొంత మంది అపరిచిత వ్యక్తులు తప్పుడు ప్రచారాలు చేసి, విద్యార్థులను మరింత ఆందోళనకు గురి చేస్తుంటారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం తప్పుడు ప్రచారాలు, పుకార్లకు ఆస్కారం కలిగించకుండా భద్రతా చర్యలు చేపట్టింది. ఆధునికత సాంకేతిక పరిజ్ఞానంతో పరీక్షల్లో తప్పిదాలకు అవకాశం లేకుండా చేయడంతో పాటు అత్యాధునిక వ్యవస్థను అమల్లోకి తెచ్చింది. ప్రభుత్వ పరీక్షల విభాగం టెన్త్ ప్రశ్నాపత్రాలను సాంకేతిక పరిజ్ఞానంతో రూపకల్పన చేసింది. పరీక్షల్లో ఎక్కడైనా లీకేజీకి గురైతూ అది ఎక్కడ ఏ పరీక్ష కేంద్రంలో, ఏ రూములో, ఏ విద్యార్థి ప్రశ్నాపత్రం నుంచి జరిగిందనే సమాచారం తెలుసుకునే వ్యవస్థను అందుబాటులోకి తెచ్చింది. పనికట్టుకుని వ్యాపింపజేసే పుకార్లకు అడ్డుకట్ట వేయడంతో పాటు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు ఆస్కారం కలుగుతుంది.

మౌలిక సదుపాయల కల్పన

టెన్త్ పరీక్షలకు విద్యాశాఖాధికారులు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నారు. పరీక్షా కేంద్రాల్లో ఫర్నీచర్, తాగునీటిని అందుబాటులో ఉంచారు.

రైతుల శ్రేయస్సు, అభివృద్ధికి అధిక ప్రాధాన్యం

జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్



రైతులకు మెగా చెక్కును అందజేస్తున్న జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే, మండలి డిప్యూటీ చైర్‌పర్సన్

రాయచోటి : ఎండనక.. వాననక.. ఆరుగాలం శ్రమిస్తున్న రైతుల శ్రేయస్సుకు.. వారి అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందని జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ తెలిపారు. 2023 ఖరీఫ్‌లో వర్షాభావం(కరువు), డిసెంబర్‌లో మిచాంగ్ తుపాను ప్రభావంతో సంభవించిన అధిక వర్షాల వల్ల పంటలు నష్టపోయిన వ్యవసాయ, ఉద్యానవన రైతన్నల ఖాతాలలో బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్ విధానంలో బటన్ నొక్కి ఇన్‌పుట్ సబ్సిడీని జమ చేశారు. కార్యక్రమానికి రాయచోటి కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, స్థానిక ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, శాసనమండలి ఉపాధ్యక్షురాలు జకియాఖానం, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ వందాడి వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ఇందులో భాగంగా అన్నమయ్య జిల్లాలోని మొత్తం 19516.21 హెక్టార్లకు గాను 34,889 మంది రైతుల ఖాతాలలో రూ.35.57 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ జమ చేశారు. ముఖ్యమంత్రి వర్చువల్ సమావేశం అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో 2023 ఖరీఫ్‌లో వర్షాభావం(కరువు) వల్ల 15946.36 హెక్టార్లలో పంటలు నష్టపోయిన 29026 మంది రైతన్నలకు రూ.26.37 కోట్లు, డిసెంబర్‌లో మిచాంగ్ తుఫాన్ వల్ల 3569.84 హెక్టార్లలో వ్యవసాయ, ఉద్యానవన పంటలు నష్టపోయిన 5863 మంది రైతులకు రూ.9.20 కోట్ల నష్టపరిహారాన్ని ముఖ్యమంత్రి మంజూరు చేశారన్నారు. కల్తీలేని నాణ్యమైన విత్తనాలు ఎరువులు, పురుగు మందులు, ఈ క్రాప్ బుకింగ్ ద్వారా పంటలబీమా, వడ్డీ లేని రుణాలు, ఇన్‌పుట్ సబ్సిడీ తదితర సేవలను అందిస్తూ ప్రభుత్వం అన్నదాతకు అన్ని విధాలా అండగా నిలబడుతోందన్నారు. ప్రకృతి విపత్తుల వలన నష్టపోయిన రైతన్నలకు సత్వర ఉపశమనం కలిగించడానికి సీజన్ ముగిసేలోగా క్రమం తప్పకుండా ఇన్‌పుట్ సబ్సిడీ మంజూరు చేస్తోందని కలెక్టర్ పేర్కొన్నారు.

రైతును రారాజుగా చేయడమే ముఖ్యమంత్రి ఆశయం

రైతును రారాజుగా చేయడమే ముఖ్యమంత్రి జగనన్న ఆశయమని రాష్ట్ర శాసనసభ వ్యవహారాల సమన్వయకర్త గడికోట శ్రీకాంత్‌రెడ్డి, శాసనమండలి ఉపాధ్యక్షురాలు జకియాఖానమ్ అన్నారు. నాడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ఆర్ రైతు రాజ్యం తెచ్చారు. వ్యవసాయాన్ని ఒక పండుగలా చేశారని, ఉచిత విద్యుత్‌తో పాటు రైతు సంక్షేమానికి అనేక కార్యక్రమాలు అమలు చేశారని కొనియాడారు. తండ్రి ఒక అడుగు ముందుకు వేస్తే ఆయన తనయుడు ముఖ్యమంత్రి జగన్ మరో రెండు అడుగులు ముందుకేసి రైతు భరోసా, వడ్డీ లేని రుణాలు, కల్తీ లేని విత్తనాలు, ఎరువులు, 9 గంటల ఉచిత విద్యుత్, రైతు భరోసా కేంద్రాలు, ఉచిత పంటలబీమా, అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ల ఏర్పాటు తదితరాలతో రైతులను పూర్తిగా ఆదుకుంటున్నారని చెప్పారు. అనంతరం ముఖ్య అతిథుల చేతుల మీదుగా ఇన్‌పుట్ సబ్సిడీ పరిహారం రూ.35.57 కోట్ల మెగా చెక్కును రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జేడీ చంద్రానాయక్, ఏడీఏ సువర్ణలక్ష్మీ, ఉద్యానవన శాఖ అధికారి రవిచంద్రబాబు, అనుబంధ శాఖల అధికారులు, సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌పుట్ సబ్సిడీ నియోజకవర్గం వారీగా..

నియోజకవర్గం	రైతులు	లబ్ధి (రూ.కోట్లలో)
రాయచోటి	10,572	10.03
పీలేరు	4404	4.16
రాజంపేట	2169	3.48
రైల్వేకోడూరు	4447	6.43
తంబళ్లపల్లి	12,339	11.07
మదనపల్లి	958	0.40

దివ్యాంగుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించడమే లక్ష్యం

- శాసనసభ వ్యవహారాల సమన్వయకర్త, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి
- దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి : జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్
- దివ్యాంగులకు బ్యాటరీ ట్రై సైకిళ్లు, వినికిడి యంత్రాలు ఉచితంగా పంపిణీ



దివ్యాంగులకు ట్రై సైకిల్ యంత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే, జేసీ తదితరులు

రాయచోటి : దివ్యాంగుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు వెళ్తోందని శాసనసభ వ్యవహారాల సమన్వయకర్త, ప్రభుత్వవిప్, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం కలెక్టర్ కార్యాలయ ఆవరణంలో రాయచోటి నియోజకవర్గంలోని విభిన్న ప్రతిభావంతులకు బ్యాటరీ ట్రై సైకిల్స్, వినికిడి యంత్రాలను రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌ల చేతులమీదుగా లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా అన్నమయ్య జిల్లాలో రెండు విడతలుగా దివ్యాంగులకు వారికి అవసరమైన పరికరాలు అందజేశామన్నారు. రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి అలిమ్‌కో సంస్థతో మాట్లాడి అర్హత ఉన్న వారికి పరికరాలు ఇప్పించడం ప్రతి ఒక్కరూ గర్వించదగ్గ విషయమన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి వెళ్లినప్పుడు వికలాంగుల స్థితిగతులు చెప్పినప్పుడు ఏదో రకంగా వీరికి సహాయం చేయాలనే ఆలోచనతో నేడు ఒక మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. కాళ్లు లేని వారికి, మాటలు వినపడని వారికి ఇలాంటి మంచి కార్యక్రమాలు చేస్తూ ఉంటే మనస్సుకు ఎంతో సంతోషంగా కలుగుతుందన్నారు. ప్రభుత్వం మానవత్వంతో చేస్తున్న ఇలాంటి మంచి కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఎన్నో కార్యక్రమాలు అమలు చేస్తుందని, అర్హులందరూ ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ వికలాంగుల సంక్షేమానికి ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని, ప్రభుత్వం అందిస్తున్న పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాయచోటి నియోజకవర్గంలో 613 మంది విభిన్న ప్రతిభావంతులకు రూ. 1,03,97,155 విలువచేసే పరికరాలు అందజేశామన్నారు. ప్రభుత్వం విలువైన పరికరాలు ఉచితంగా అందజేసిందని, ప్రతి ఒక్కరూ వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అర్హత ఉన్నవారు ఇంకా ఎవరైనా మిగిలి ఉంటే వారందరికీ అర్హత మేరకు పరికరాలు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ వెంకటేశ్వర్లు, జెడ్పీటీసీ వెంకటేశ్వరరెడ్డి, మాజీ రెస్కో చైర్మన్ కృష్ణారెడ్డి, వికలాంగుల సంక్షేమ శాఖ అధికారి కృష్ణ కిషోర్, దివ్యాంగులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కార్మికుడు అదృశ్యం


మహబూబ్ బాషా

మదనపల్లె : వెల్డింగ్ కార్మికుడు అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ వలీబాషు తెలిపారు. పట్టణంలోని దేవళం వీధిలో నివాసముంటున్న ఖాదర్‌వలి కుమారుడు మహబూబ్ బాషా(44), ఆనంద్ బాబు భారత్ ఇంజినీరింగ్ వర్క్స్ షాపులో వెల్డింగ్ కార్మికుడిగా పని చేస్తున్నారు. కుటుంబ అవసరాల నిమిత్తం పలుచోట్ల అప్పులు చేశాడు. ఇటీవల రుణదాతల నుంచి ఒత్తిళ్లు అధికమయ్యాయి. ఈ నేపథ్యంలో ఈనెల 4న ఉదయం షాపుకు వెళ్తున్నానని ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో ఐదో తేదీన రాత్రి అతని భార్య ఫరానా వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆ మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రామయ్య సన్నిధిలో ఎస్బీఐ ఏజీఎం


సీజీఎంకు రామయ్య చిత్రపటాన్ని అందజేసి సత్కరిస్తున్న ఒంటిమిట్ట ఎస్‌బీఐ మేనేజర్ కవిత

ఒంటిమిట్ట : ఆంధ్ర భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట కోదండరామస్వామిని బుధవారం అమరావతి సర్కిల్ ఎస్‌బీఐ సీజీఎం నవీన్‌చంద్ర సతీసమేతంగా దర్శించుకున్నారు. ఈ గర్భాలయంలో మూలవిరాట్‌కు ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ సిబ్బంది స్థానిక రంగ మండపంలో నవీన్‌చంద్ర దంపతులను సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు. ఒంటిమిట్ట ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ కవిత, ఆమె సిబ్బంది వారికి స్వామి చిత్రపటాన్ని అందజేసి సత్కరించారు.

8న వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణం


బ్రహ్మంగారిమఠం


భక్తులకు ఏర్పాటు చేసిన చలువ పందిర్లు

- ఈ నెల 7 నుంచి 11వ తేదీ వరకు ఉత్సవాలు
- రెండు రాష్ట్రాల నుంచి తరలిరానున్న భక్తులు

బ్రహ్మంగారిమఠం : భవిష్యత్ కాలజ్ఞాన కర్త పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి, గోవింద మాంబల కల్యాణ వేడుకలకు బ్రహ్మంగారి మఠం సిద్ధమవుతోంది. ఈ నెల 7 వతేదీ నుంచి 11వ తేదీ వరకు మూడు రోజులపాటు ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎండోమెంట్ ఏసీ శంకర్‌బాలాజీ, మేనేజర్ ఈశ్వరాచారి తెలిపారు. 8న మహాశివరాత్రి సందర్భంగా మహాశివరాత్రి సందర్భంగా వీరబ్రహ్మేంద్ర స్వామి, గోవింద మాంబల కల్యాణం నిర్వహించనున్నారు.

ఇందులో భాగంగా 7న గురువారం ఉదయం ఐదు గంటలకు సుప్రభాతం, నామ సంకీర్తన, అభిషేకం, 12 గంటలకు పూర్వపు మఠాధిపతులు, గోవింద స్వామి ధర్మపత్ని వీరపాపమాంబ ఆరాధన, 4 గంటలకు పురాణ కాలక్షేపం, రాత్రి 8గంటలకు కలశోత్సవం, 9 గంటలకు అంకురార్పణ10 గంటలకు హరికథ ఉంటాయి. 8న శుక్రవారం మహాశివరాత్రి సందర్భంగా ఉదయం 5 గంటలకు సుప్రభాతం, 12 గంటలకు దీక్షా బంధనాలంకారోత్సవం, 2 గంటలకు నామసంకీర్తన, 4 గంటలకు గుడి ఉత్సవం, 6 గంటలకు పండితులచే ఉపన్యాశం, రాత్రి 8 ఉభయదాతల ఆధ్వర్యంలో బ్రహ్మంగారి కల్యాణం ఉంటాయి. రాత్రి 11 గంటలకు నరనందిని ఉత్సవం, 12 గంటల నుంచి జాగరణ, 9వ తేదీన శనివారం ఉదయం 10 గంటలకు మోహినీ అలంకారోత్సవం, 12 గంటలకు నామ సంకీర్తన, 8 గంటలకు హరికథ, 9 గంటలకు నంది ఉత్సవం, 10వతేదీన ఆదివారం మహాప్రసాద వినియోగము. 11వ తేదీన సోమవారం వసంతోత్సవం ఉంటాయి.

పాముకాటుతో రైతుకు అస్వస్థత

నిమ్మనపల్లె : పాముకాటుతో రైతు తీవ్ర అస్వస్థతకు గురైన సంఘటన మంగళవారం రాత్రి మండలంలోని రెడ్డివారిపల్లె పంచాయతీ సోమానుపల్లెలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రైతు రామస్వామి (50) పొలం పనులు చూసుకుని ఇంటికి తిరిగి వస్తుండగా, మార్గమధ్యంలో పాము కాటుకు గురయ్యాడు. తీవ్ర అస్వస్థతకు లోను కాగా సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు, బాధితుడిని వెంటనే మదనపల్లె ఆసుపత్రికి తరలించారు. చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తీసుకెళ్లారు.

ఏజీపీగా షమీఉల్లా ఖాన్



నందలూరు(రాజంపేట) : నందలూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏజీపీగా షమీఉల్లాఖాన్ నియమితులయ్యారు. షమీఉల్లాఖాన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ లీగల్ అండ్ లెజిస్లేటివ్ అఫైర్స్ అంజ్ జస్టిస్ రాష్ట్ర కార్యదర్శి జి సత్యప్రభాకర్ రావు నుంచి తనకు నియామక ఉత్తర్వులందాయని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు


గాయపడ్డ నరసింహులు

సంబేపల్లె : చిత్తూరు–కర్నూలు జాతీయ రహదారిపై గుట్టపల్లె సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నరసింహులు అనే వ్యక్తికి గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు గుట్టపల్లెకి చెందిన నరసింహులు ద్విచక్ర వాహనంలో రోడ్డు దాటుతుండగా గాలివీడు నుంచి తిరుపతికి వెళ్తున్న కారు ఢీ కొనడంతో గాయాలయ్యాయి. 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

అంబులెన్స్, బైక్ ఢీ

ఒకరి మృతి, మరొకరికి తీవ్ర గాయాలు


మృతి చెందిన ఎల్లప్ప


తీవ్రంగా గాయపడిన వెంకటరమణ

మదనపల్లె సిటీ : అంబులెన్స్, ద్విచక్రవాహం ఢీకొనడంతో ఓ వ్యక్తి అక్కడిక్కడే మృతి చెందగా, మరొక వ్యక్తి తీవ్రంగా గాయపడన సంఘటన మదనపల్లె మండలం ఆరోగ్యవరం వద్ద బుధవారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం మేరకు.. మదనపల్లె పట్టణం చీకలిగుట్టకు చెందిన బిట్టు ఎల్లప్ప (42) ఆటో డ్రైవర్. గుర్రంకొండ మాదిగపల్లెకు చెందిన వెంకటరమణ (35)లు కలిసి ద్విచక్రవాహనంలో సొంత పనుల నిమిత్తం ఇంటి నుంచి బయలుదేరి వెళ్లారు. ఈ క్రమంలో ఆరోగ్యవరం మలుపు వద్ద తిరుపతి నుంచి మదనపల్లెకు వస్తున్న ప్రైవేటు అంబులెన్స్ బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఎల్లప్ప (42)అక్కడిక్కడే మృతి చెందాడు. ద్విచక్ర వాహనం వెనుక ఉన్న వెంకటరమణ తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే అంబులెన్స్ ద్వారా మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. వెంకటరమణకు తలకు తీవ్రంగా గాయపడ్డాడు. పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. విషయం తెలిసిన వెంటనే తాలూకా సీఐ శేఖర్, ఎస్.ఐలు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. రోడ్డు ప్రమాదం జరిగిన విషయం తెలిసిన వెంటనే మదనపల్లె ఆర్డీవో హరిప్రసాద్, తహశీల్దార్ రమాదేవిలు జిల్లా ఆస్పత్రికి చేరుకున్నారు. మృతుని భార్య మల్లీశ్వరిని పరామర్శించారు. తీవ్రంగా గాయపడిన వెంకటరమణకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు.


ఆస్పత్రి వద్ద సంఘటన వివరాలు తెలుసుకుంటున్న ఆర్డీవో, తహశీల్దార్

మద్యానికి డబ్బు ఇవ్వలేదని భార్య, తల్లిపై దాడి


భర్త చేతిలో తీవ్రంగా గాయపడిన భార్య అనూష



కొడుకు చేతిలో గాయపడిన తల్లి రెడ్డమ్మ

మదనపల్లె : మద్యం తాగేందుకు డబ్బు ఇవ్వలేదనే కోపంతో భార్య, తల్లిపై ఓ వ్యక్తి విచక్షణారహితంగా దాడి చేసిన సంఘటన బుధవారం మదనపల్లె మండలంలో జరిగింది. వేంపల్లెకు చెందిన మదన్‌కుమార్ నాయుడు గత కొంతకాలంగా మద్యానికి బానిసై, కుటుంబ బాధ్యతలు పట్టించుకోకుండా జులాయిగా తిరుగుతున్నాడు. బుధవారం ఉదయం పూటుగా మద్యం తాగి ఇంటికి వచ్చాడు. మళ్లీ మద్యం తాగేందుకు డబ్బు ఇవ్వాల్సిందిగా భార్య అనూష(30)ను అడిగాడు. దీంతో ఆమె భర్తతో గొడవ పడింది. ఆవేశానికి లోనైన మదన్ కుమార్ నాయుడు కర్ర తో ఆమెపై విచక్షణారహితంగా దాడి చేశాడు. గొడవను అడ్డుకునేందుకు అతని తల్లి రెడ్డమ్మ (60) ప్రయత్నించగా ఆమెపై దాడి చేశాడు. దాడిలో అనూష రెండు చేతులు, కాలు విరగ్గా తలకు గాయమైంది. తల్లికి ఎడమ చేయి విరగగా తలపై తీవ్ర గాయమైంది. స్థానికులు బాధితులను 108 అంబులెన్స్‌లో మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స అనంతరం అనూష పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రిఫర్ చేశారు. తాలూకా పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

కష్టానికి గుర్తింపే మహిళా దినోత్సవం


సభలో మాట్లాడుతున్న ఏఈటీ సభ్యురాలు దీప్తి


సదస్సుకు హాజరైన అధ్యాపకులు, ప్రొఫెసర్లు, విద్యార్థినులు

రాజంపేట : ఎందరో వనితల కష్టానికే గుర్తింపే అంతర్జాతీయ మహిళా దినోత్సవమని ఏఐటీఎస్, అన్నమాచార్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్ మెంబర్(ఏఈటీ) చొప్పా దీప్తి అన్నారు. 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఏఐటీఎస్ గార్డెన్‌లో బుధవారం రాత్రి ముందస్తుగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా దీప్తి మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా మహిళల పట్ల ఉన్న వివక్షను బద్దలు కొట్టడమే ఈ దినోత్సవ ప్రధానలక్ష్యమన్నారు.వైఎస్సార్ కడప జిల్లా డీఈవో ఎం.అనురాధ మాట్లాడుతూ మహిళలు ఆర్థిక, సామాజిక అభివృద్ధి సాధించాలంటే విద్య కీలకమన్నారు. డీఎఫ్ఓ టి.నాగమణేశ్వరి మాట్లాడుతూ నేటి సమాజంలో మహిళలంతా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. వైవీయూ ప్రొఫెసర్ చంద్రమతి శంకర్ మాట్లాడుతూ అన్ని రంగాల్లో మహిళలు సాధించిన విజయాలను గుర్తించి వారిని గౌరవించుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. అనంతరం అతిథులను ఏఐటీఎస్ యాజమాన్యం శాలువా కప్పి ఘనంగా సత్కరించి, జ్ఞాపిక అందజేశారు. ఈ కార్యక్రమంలో అన్నమాచార్య ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డా.స్వర్ణలత, పీజీ కాలేజ్ ఆఫ్ కంప్యూటర్ స్టడీస్ సమతా నాయుడు, ఏఐటీఎస్ వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, పరిపాలనాధికారి సుబ్బారెడ్డి, ఆచార్యులు, అధ్యాపకులు. విద్యార్థినులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జైలు శిక్ష

నందలూరు(రాజంపేట) : మద్యం తాగి వాహనం నడిపిన మండలంలోని నందలూరు హరిజనవాడకు చెందిన ఈరి సుబ్బరాయుడుకు న్యాయమూర్తి కె.లత నాలుగు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ మహమ్మద్ అబ్దుల్ జహీర్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ మద్యం తాగి వాహనం నడపుతూ పట్టుబడిన అతడిని కోర్టులో హాజరుపరచగా, జడ్జి జైలు శిక్ష విధించారన్నారు.

గోవా మద్యం స్వాధీనం


నిందితుల అరెస్టు చూపుతున్న ఎస్ఈబీ అధికారులు

మదనపల్లె : ఇన్నోవా క్రిస్టా వాహనంలో అక్రమంగా తరలిస్తున్న గోవా మద్యం స్వాధీనం చేసుకుని, ఐదుగురిని అరెస్టు చేసినట్లు సీఐ రమేష్‌రెడ్డి తెలిపారు. విలేకరులతో సీఐ మాట్లాడుతూ మండలంలోని కర్ణాటక సరిహద్దు చీకలబైలు చెక్‌పోస్టు వద్ద ఎస్ఈబీ అధికారులు తనిఖీలు నిర్వహించారన్నారు. మంగళవారం సాయంత్రం ఇన్నోవా క్రిస్టా వాహనంలో రూ.23,480 విలువ చేసే గోవామద్యం గుర్తించామన్నారు. తక్షణమే కారును స్వాధీనం చేసుకుని, పీలేరు సమీపంలోని బోడుమల్లువారిపల్లెకు చెందిన ఎస్.అహ్మద్ బాషా(34), ఎస్.రవీంద్రనాథ్‌రెడ్డి(44), ఎస్.ఫారూఖ్(24), ఎం.కుమారనాథరెడ్డి(41), ఎ.బాలాజీ(39)లను అరెస్టు చేశామన్నారు. వారిని మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచి రిమాండ్‌కు పంపడం జరిగిందన్నారు.

గంగమ్మ ఆలయ అభివృద్ధికి కృషి

ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి


గంగమ్మతల్లికి పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి

లక్కిరెడ్డిపల్లె : అనంతపురం గంగమ్మ దేవత ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి అన్నారు. లక్కిరెడ్డిపల్లె మండలం అనంతపురం గ్రామంలో గంగమ్మ తల్లి నూతన ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకార కార్యక్రమం బుధవారం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ముందుగా అనంతపురం గంగమ్మతల్లికి ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి, మాజీ ఎంపిపి రెడ్డయ్యలతో కలిసి పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వాహకులు అతిథులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ కోర్కెలు తీర్చే దేవతగా అనంతపురం గంగమ్మ తల్లి విరాజిల్లుతోందన్నారు. ఆలయాన్ని రాయలసీమ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు పొందేలా నూతన ధర్మకర్తల మండలి కృషి చేయాలన్నారు. సౌకర్యాల కల్పనలో ధర్మకర్తలి మండలి తనదైన ముద్ర చూపించాలన్నారు. నియోజకవర్గ పరిధిలో పలు ఆలయాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. అనంతరం ఈ నెల 11, 12వ తేదీలలో జరిగే అమ్మవారి జాతర మహోత్సవ పోస్టర్‌ను స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గంగమ్మ ఆలయ చైర్మన్ మురికినాటి రెడ్డయ్య, గడ్డం జనార్దన్ రెడ్డి, సామాల నరసింహారెడ్డి, రాజబాబు, రాజారెడ్డి, ఆనంద విజయ్ కుమార్, మోహన్ కుమార్, గణపతి, సుదర్శన్ రెడ్డి, చంద్రశేఖర్, ఓబులేశు, గంగరాజు, నాగార్జున, గంగయ్య పాల్గొన్నారు.

ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం..

అనంతపురం గంగమ్మ తల్లి ఆలయ నూతన ధర్మకర్తల మండలి చైర్మన్‌గా రెడ్డయ్య, సభ్యులు కలిసి గంగమ్మ తల్లికి ఎదురుగా ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి, ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి, మాజీ ఎంపీపీ అంబాబత్తిన రెడ్డయ్య, సర్పంచులు వెంకట నారాయణ రెడ్డి, గడ్డం కళ్యాణి ప్రభాకర్ రెడ్డిల సమక్షంలో ఆలయ ప్రత్యేక అధికారి రవీంద్రరాజు ప్రమాణ స్వీకారం చేయించారు.

కామాంధుడు... కటకటాలపాలు

ఇంటర్ విద్యార్థినిని వేధించిన పీఈటీ అరెస్టు


పీఈటీ భాస్కర్‌ను అరెస్టు చేసిన ముదివేడు పోలీసులు

కురబలకోట : వివాహమై భార్య, పిల్లలు ఉన్నా.. కామంతో కళ్లు మూసుకు పోయి విద్యార్థినులను వేధింపులకు గురిచేస్తున్న ఉపాధ్యాయుడిని పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ముదివేడు ఎస్సై మల్లికార్జునరెడ్డి వివరాల మేరకు.. మదనపల్లె–అంగళ్లు మార్గంలోని ఓ జూనియర్ కళాశాల పీఈటీ భాస్కర్ (33) సీనియర్ ఇంటర్ విద్యార్థిని(17)పై కిరాతకంగా లైంగిక వేదింపులకు పాల్పడిన విషయం తెలిసిందే. ఫోక్సో చట్టం కింద ఇతనిపై కేసు నమోదు చేసిన పోలీసులు విచారించారు. కళాశాలలో పనిచేస్తూ విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించేవాడని, లైంగికంగా వేధిస్తూ ఫొటోలు తీసి తనను ప్రేమించకపోతే బ్లాక్ మెయిల్ చేసేవాడని విద్యార్థినులు పోలీసులకు తెలిపారు. మాట వినకపోతే ఫోటోలు వైరల్ చేస్తానని బెదిరించడంతో ఓ అమ్మాయి ధైర్యం చేసి పీఈటీ వికృత చేష్టలను తల్లిదండ్రులకు వివరించింది. అంతేగాక పక్కా ఆధారాలు, ఫొటోలతో సహా ముదివేడు పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో గుట్టుగా సాగుతున్న పీఈటీ కామ కలాపాలకు బ్రేక్ పడింది. బుధవారం కటకటాల పాలయ్యాడు. ధైర్యంగా పోలీసులకు ఫిర్యాదు చేసిన ఆ విద్యార్థినిని పలువురు అభినందిస్తున్నారు. మైనర్ బాలికల పట్ల పోక్సో చట్టం రక్షణ కవచంగా నిలుస్తోందిదని, పక్కా ఆధారాలతో కేసు నమోదైతే జైలు శిక్ష తప్పదని ఎస్సై హెచ్చరించారు.

బంధువులే... రాబందులయ్యారు

అమ్మా, నాన్న లేరు.. అక్క పెళ్లి చేసుకుని వెళ్లిపోయింది. అన్న కొద్ది రోజులుగా కనిపించకుండా పోయాడు. బంధువులకు అన్నపై ఉన్న కోపం.. చెల్లిపై ద్వేషంగా మారింది. ఇంకేముంది బంధువులే రాబందులై చెవిటి, మూగ సమస్యతో బాధపడుతున్న దివ్యాంగురాలిపై కనీస కనికరం లేకుండా ఇంటిలో నుంచి గెంటేశారు. సామాన్లు బయటపడేశారు. ఈ సంఘటన బుధవారం సాయంత్రం మదనపల్లె మండలంలో జరిగింది.


బయటకు గెంటివేసి తాళం వేయడంతో దిగాలుగా నిలబడిన రజిత

- దివ్యాంగురాలిని ఇంట్లో నుంచి గెంటేసిన వైనం
- గ్రామానికి చేరుకుని.. పోలీసుల విచారణ

మదనపల్లె : మండలంలోని సీటీఎం (చిన్నతిప్పసముద్రం) గ్రామానికి చెందిన రామకృష్ణ రమాదేవి దంపతుల కుమార్తె రజిత (17) చెవిటి, మూగ సమస్యలతో బాధపడుతోంది. కొన్ని సంవత్సరాల క్రితం తల్లిదండ్రులు అనారోగ్యంతో మృతి చెందారు. అక్క వివాహం చేసుకుని వెళ్లిపోయింది. రజిత, ఆమె అన్న కిరణ్‌కు నిలువ నీడ లేకుండా పోయింది. దీంతో స్థానికుడైన శివ తన ఇంటిని రజిత, కిరణ్‌లు తల దాచుకునేందుకు ఉచితంగా ఇచ్చాడు. ఈ క్రమంలో ఏడాది కిందట కిరణ్ పెద్దనాన్న కొడుకు కుమార్‌కు చెందిన ద్విచక్ర వాహనం అగ్నికి ఆహుతైంది. ఇందులో కిరణ్ ప్రమేయం ఉన్నట్లు అనుమానించారు. అప్పటి నుంచి అన్నా, చెల్లెల్లను వేధించారు. కొన్ని రోజుల కిందటి నుంచి కిరణ్ కనిపించకుండా పోయాడు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం కుమార్, అతని భార్య, కుటుంబ సభ్యులు రజిత నివసిస్తున్న ఇంటికి చేరుకుని ఆమెను బలవంతంగా బయటకు గెంటివేసి తాళం వేశారు. దివ్యాంగురాలిపై కనికరం లేకుండా కర్కశంగా ప్రవర్తించారు. ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాక కన్నీటి పర్యంతమైన రజిత దిగాలుగా ఇంటి ముందు నిలబడిపోయింది. ఈ విషయం సామాజిక మాధ్యమాల ద్వారా తెలియడంతో స్థానికులు తాలూకా పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ వెంకటేష్, సిబ్బందితో కలిసి గ్రామానికి చేరుకుని విచారించారు. మానవత్వం లేకుండా ప్రవర్తించిన కుమార్, అతడి కుటుంబసభ్యులను తాలూకా పోలీసు స్టేషన్‌కు తరలించారు. కేసు విచారిస్తున్నట్లు తెలిపారు.

రాష్ట్ర స్థాయి ప్రదర్శనలో భళా

కడప ఎడ్యుకేషన్ : విద్యార్థుల్లో వ్యవస్థాపక మనస్తత్వం పెంపొందించడానికి విజయవాడలో నిర్వహించిన ఎంటర్ ప్రెన్యూర్ మైండ్ సెట్ డెవలప్‌మెంట్ రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు జిల్లా నుంచి ప్రాజెక్టులు ఎంపికయ్యాయి. పులివెందుల మండలం నల్లపురెడ్డిపల్లె జెడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థి ఇలియాజ్ తయారుచేసిన స్మార్ట్ ఫ్లోర్ క్లీనర్ ప్రాజెక్టు ఎంపికైంది. ఈ పరికరం ద్వారా దస్తును క్లీన్, స్ప్రే, వైపింగ్‌తోపాటు డ్రై చేయడం లాంటి పనులన్నీ ఎలా చేయవచ్చో విద్యార్థి వివరించారు. వనిపెంట పాఠశాల విద్యార్థులు హర్షిత, గాయత్రి, త్రివేణి సుగంధ ద్రవ్యాలను ఉపయోగించి దోమలను పారద్రోలే బత్తీలను, అల్లికలను తయారు చేయవచ్చో వివరించారు.